క్లుప్తంగా

ఐజీబీసీ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం



స్టూడెంట్ చాప్టర్ ప్రారంభిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) స్టూడెంట్ చాప్టర్‌ని మంగళవారం ప్రారంభించారు. ఆరో హరిత్ ప్రేమ్ భారత్ మహోత్సవ్ 2024లో భాగంగా 369వ విద్యార్థి శాఖను ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేశారు. గ్రీన్ బిల్డింగ్‌లపై యువతకు అవగాహన కల్పిస్తూ, వీటికి సంబంధించిన సమాచారాన్ని ఈ శాఖ అందిస్తుంది. ఐజీబీసీ విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం చైర్మన్ లీలా ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజ.. స్టూడెంట్ చాప్టర్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ధ్రువ పత్రాలను ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.ఎ న్.ఇ.సత్యనారాయణరెడ్డి, ఐజీబీసీ సీనియర్ కౌన్సెలర్ శ్రీరేఖ, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగికి పరామర్శ



ఎల్లయ్యను పరామర్శిస్తున్న అక్కరమాని వెంకటరావు

ఎంవీపీ కాలనీ: విమ్స్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బడే ఎల్లాజీ తండ్రి ఎల్లయ్యను మంగళవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు పరామర్శించారు. ఎల్లయ్య గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న వెంకటరావు పార్టీ నాయకులతో కలిసి విమ్స్ ఆస్పత్రికి వెళ్లి ఎల్లయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యాత కార్పొరేషన్ డైరెక్టర్ పోలవరపు అప్పారావు, పార్టీ నాయకులు వైద నారాయణరావు, ముద్దాడ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల్లో మానసిక ఒత్తిళ్లను తగ్గించాలి

బీచ్ రోడ్డు: వృద్ధుల్లో కలిగే మానసిక ఒత్తిళ్లను తగ్గించుకోవలసిన అవసరం ఉందని డాక్టర్ నిహాల్ అన్నారు. కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పలు వృద్ధాశ్రమాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వ్యాధుల వలే మానసిక సమస్యలు కూడా ఎక్కువగా ఉంటున్నాయని, వాటిని నివారించే విధానాలను నిహాల్ వివరించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

ఎంవీపీకాలనీ: విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులతో పాటు పాఠశాలల యాజమాన్యాలు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఎంవీపీ కాలనీలోని శాంతి నికేతన్ పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. రెయిన్‌బో పిల్లల ఆస్పత్రి, వాసన్ ఐకేర్, కిడ్స్ డెంటల్ ఆస్పత్రుల సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు.



బతుకు బండికి ఇంధనం

- ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు అండగా నిలుస్తున్న వాహన మిత్ర పథకం
- నియోజకవర్గంలో 4,050 మందికి లబ్ధి
- ప్రతి విడతకు రూ 4.05 కోట్ల జమ



అపోలో ఆస్పత్రి వద్ద ఆటో స్టాండ్

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ: ప్రతిపక్ష నేతగా నిర్వహించిన ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డ్రైవర్లు కూడా తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. వారి కష్టాలను విన్న నాటి ప్రతిపక్ష నేత నేనున్నానని మాటిచ్చారు. అధికారంలోకి రాగానే వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్‌లను నడుపుకొంటూ జీవనం సాగిస్తున్న ప్రతి డ్రైవర్‌కు అకౌంట్‌లో ఏటా రూ.10వేలు జమ చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని పథకాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. సొంత వాహనంలో ఉపాధి పొందుతున్న డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లకు బాసటగా నిలిచారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నాయకుల సిఫార్సులు అవసరం లేకుండా అర్హతే ప్రమాణికంగా పథకాన్ని అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వం ఏ పథకం అమలు చేయాలన్నా జన్మభూమి కమిటీల పేరుతో దందాలు సాగించిన విషయం తెలిసిందే. అలాంటి విధానానికి స్వస్తి పలికిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేసింది.

తూర్పు నియోజకవర్గంలో 4,050 మంది ఆటో డ్రైవర్లు వాహన మిత్ర పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ జోన్-2, 3 పరిధుల్లో ఉంది. ఆయా జోన్లలో 15 వార్డులున్నాయి. జోన్-2 పరిధిలో 9 నుంచి 13 వరకు ఐదు వార్డులు ఉండగా, జోన్-3 పరిధిలో 15 నుంచి 23వ వార్డులతో పాటు 28వ వార్డుతో కలిపి పది వార్డులు ఉన్నాయి. జోన్-2లో 2,258 మంది, జోన్-3లో 1792 మంది లబ్ధి పొందుతున్నారు. వీరికి ప్రతి విడతకు రూ 4.05 కోట్లు ఆర్థిక సాయంగా అందజేస్తున్నారు.



ఆరిలోవ హెల్త్‌సిటీలో భగత్‌సింగ్ ఆటో యూనియన్ స్టాండ్

వార్డుల వారీగా లబ్ధిదారులు

జోన్-2 పరిధిలో..

వార్డు	లబ్ధిదారులు
9	421 మంది
10	561 మంది
11	417 మంది
12	364 మంది
13	495 మంది

జోన్-3 పరిధిలో..

వార్డు	లబ్ధిదారులు
15	212 మంది
16	189 మంది
17	168 మంది
18	132 మంది
19	112 మంది
20	158 మంది
21	140 మంది
22	253 మంది
23	219 మంది
28	209 మంది

ఐదు సార్లు సహాయం అందింది



సుమారు 15 ఏళ్లుగా ఆటో నడుపుతున్నాను. మమ్మల్ని మొదటి సారిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి సహాయం అందించారు. సంవత్సరానికి రూ.10 వేలు నేరుగా ఖాతాలో జమ చేస్తున్నారు. వరుసగా ఐదు సార్లు వాహన మిత్ర సాయం అందుకున్నాను. ఆ డబ్బులు నాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయి వాహన మిత్ర కొనసాగించాలని కోరుకొంటున్నాను.

– సాశెట్టి రమేష్, ఆటో డ్రైవర్, గాంధీనగర్, ఆరిలోవ

డ్రైవర్లను గుర్తించిన తొలి సీఎం జగన్



ఆటో డ్రైవర్ల గుర్తించి సమస్యలు తెలుసుకున్న మొట్టమొదటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన వాహన మిత్ర పేరుతో సంవత్సరానికి రూ.10 వేలు సహాయం అందిస్తున్నారు. దీని వల్ల బీమా, ఫైనాన్స్‌లు కట్టుకోవడం వంటి అవసరాలు తీరాయి. సీఎంకు రుణపడి ఉంటాం.

– కందుల శ్రీనివాసరావు, భగత్‌సింగ్ ఆటో యూనియన్, ఆరిలోవ

వాహన మిత్రతో ఆటో డ్రైవర్లకు మేలు



వాహన మిత్ర పథకం వల్ల ఆటో డ్రైవర్లకు మేలు కలుగుతుంది. ఐదు విడతల పాటు రూ.50 వేలు అందాయి. ఈ డబ్బులు ఇన్సూరెన్స్ కట్టడానికి ఉపయోగపడ్డాయి. అప్పు చేయాల్సిన అవసరం తప్పింది. ఆటో డ్రైవర్లకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– బండి అప్పన్న, భగత్‌సింగ్ ఆటో యూనియన్, ఆరిలోవ

కోవిడ్ సమయంలో ఆర్థిక తోడ్పాటు



వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా జగనన్న ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం కుటుంబ ఆర్థిక తోడ్పాటుకు దోహదం చేస్తుంది. కోవిడ్ సమయంలో అన్ని రంగాలతో పాటు ఆటో డ్రైవర్లు బేరాలు లేక ఇళ్లకే పరిమితమయ్యారు. అలాంటి సమయంలో రూ.10 వేలు సాయం అందించడంతో కొంత ఉపశమనం లభించింది. ఆటో డ్రైవర్లు అందరూ ఈ పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయాన్ని ఆటో మెయింటెనెన్స్‌తో పాటు ఇతర అవసరాలకు వినియోగించుకుంటూ లబ్ధిపొందుతున్నారు. జగనన్న ప్రభుత్వం నిర్విరామంగా ఈ సాయం అందించాలని కోరుతున్నాం.

– ఉల్లిభద్ర శ్రీధర్, ఆటో డ్రైవర్, లాసన్స్ బే కాలనీ

ఎంపీ ఎంవీవీ పాదయాత్రకు నీరాజనం



ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్రకు వాడవాడలా ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా సాగుతున్న ఈ యాత్రలో భాగంగా ఎంవీవీ మంగళవారం 25వ రోజు 17వ వార్డులో పర్యటించారు. ఆదర్శనగర్, నేతాజీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్యతో పాటు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాగిస్తున్న ప్రజాకర్షక పాలనను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులైన మహిళలు ఎంపీకి హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ గెలుపునకు నగరవాసులు కృషిచేయాలన్నారు. ప్రతి ఇంటి అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు దోహదం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీషోర్ వాకర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాసరెడ్డి

ఏయూ క్యాంపస్: స్థానిక వీఎంఆర్‌డీఏ పార్కులోని సీ షోర్ వాకర్స్ క్లబ్ 2024 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం పార్కులో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా డి.శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.తిరుపతిరావు, సలహాదారులుగా బచ్చల రమణయ్య, తిమ్మారెడ్డి వెంకటరావు, జానకిరామ్, జి.సాంబశివరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పార్కులో వాకర్స్ ఆరోగ్యానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సరదా సరదా స్కిట్లతో వాకర్స్‌ను నవ్వించే కార్యక్రమాలు చేపడతామన్నారు.

రూ.11.49 కోట్లతో అభివృద్ధి పనులు

భూమి పూజ చేసిన మేయర్ గొలగాని హరివెంకటకుమారి



అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి



జ్యోతినగర్‌లో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ 11, 12 వార్డు పరిధిలో రూ.11.49 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆరిలోవ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇంతవరకు ఎప్పుడూ జరగని అభివృద్ధి ఈ ప్రాంతంలో గత ఐదు సంవత్సరాలుగా జరుగుతుందన్నారు.

మరింత అభివృద్ధి చేయడానికి ఇక్కడ కార్పొరేటర్లతో కలిసి పని చేస్తున్నామన్నారు. ఇక్కడ రూ.3.45 కోట్లతో పెదగదిలి బీఆర్‌టీఎస్ కూడలి నుంచి తోటగరువు వెళ్లే మధ్యలో పెద్ద గెడ్డపై ఉన్న బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, బాలాజీనగర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు రూ.3.76 కోట్ల నిధులతో కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ఇదే ప్రాంతంలో మరో రూ.1.75 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు డివైడర్, వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. వీటితో పాటు రూ. 2.53 కోట్ల నిధులతో సూర్యతేజానగర్ బ్రిడ్జి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు బీటీ రోడ్డు, కాలువలు, ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లు, పార్వతినగర్ వద్ద క్రాస్ కల్వర్టు విస్తరణ, డివైడర్, వీధి దీపాల నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. ఆరిలోవ పుట్టిన తరువాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా అభివృద్ధి పనులు జరగడం ఇక్కడ ప్రజల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, వైల్డ్‌లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, బోను శ్రీను, సుబ్బారెడ్డి, అర్జున్, హుస్సేన్, సత్యనారాయణ, వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు జ్యోతినగర్‌లో కాలువల నిర్మాణం కోసం మంగళవారం కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇక్కడ స్థానికులకు సమస్యగా మారిన పెద్ద కాలువలో పూడిక తొలగించి కొత్తగా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దీని కోసం రూ.32 లక్షలు జీవీఎంసీ నిధులు కేటాయించామన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆమె ఆదేశించారు.

ఏయూ సమాచారమ్

చంద్రబోస్‌కు ఘన నివాళి



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆచార్య టి.షారోన్‌రాజు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో నేతాజీ సుభాష్ చంద్రబోష్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చంద్రబోష్ చిత్రపటానికి విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను సైతం అర్పించడానికి సిద్ధపడిన మహోన్నత వ్యక్తి చంద్రబోస్ అని కొనియాడారు. నేటి తరం యువత ఆయనలోని తెగువ, ధైర్యం, దేశభక్తిని స్ఫూర్తిగా పొందాలని సూచించారు. అజాద్ హింద్ ఫౌజ్‌ని స్థాపించి బ్రిటిష్ వారిపై యుద్ధానికి స్వతంత్ర ఆర్మీని తీర్చిదిద్దిన యోధుడిగా ఆయన నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డి.నాగరాజ కుమారి, డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ప్రకాషరావు, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ సాల్మన్‌రాజు, డాక్టర్ ప్రవీణ, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్లాష్‌మాబ్ రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఓఎస్‌డీ లక్ష్మీనారాయణ, తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఫ్లాష్‌మాబ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కె.హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఇంజినీరింగ్ కళాశాల ఓఎస్‌డీ ఆచార్య లక్ష్మీనారాయణ, చీఫ్ వార్డెన్ ఆచార్య చిట్టిబాబు, ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విభాగాధిపతి ఆచార్య ఎస్.ప్రజ్ఞలతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. అందరూ సమానమే అనే నినాదంతో ఒక సామాజిక సందేశాన్ని చాటే విధంగా ఈ ఫ్లాష్ మాబ్ గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఇంజినీరింగ్ కళాశాల బాస్కెట్‌బాల్ మైదానంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ యునైటెడ్ క్లబ్ అధ్యక్షుడు హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

వీసీ ప్రసాదరెడ్డికి అభినందన



వీసీతో ఏఏఏ చైర్మన్ డాక్టర్ శంకరరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం(ఏఏఏ) చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు మంగళవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. రెండో పర్యాయం వీసీగా బాధ్యతలు స్వీకరించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణలను ఆయన వీసీకి వివరించారు.

జాబ్ మేళా రేపు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అపెక్స్, ఫ్యూచర్‌మెన్ పవర్ సెక్యూరిటీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 100 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. నర్సింగ్ స్టాఫ్, హోమ్‌కేర్ టేకర్, ఆపరేటర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఎంబీఏ, బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించి 18–30 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. జీతం నెలకు రూ.12,000–14,000 వరకు ఉంటుందన్నారు. ఉద్యోగం విశాఖ కేంద్రంగా చేయాల్సి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

నైతిక విలువలు బోధించే నాయకత్వం అవసరం



గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: నైతిక విలువలు బోధించే నాయకత్వం కోసం యువత ఎదురుచూస్తోందని ఏయూ న్యాయ కళాశాల పూర్వ ఆచార్యుడు, డీఎస్ఎన్ఎల్‌యూ పూర్వ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ అన్నారు. ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గాంధీజీ–జాతీయ సమైక్యత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతీ పౌరుడు బాధ్యతలు కలిగి ఉండాలన్నారు. ముందుగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక అతిథి విజయ విహారం రమణమూర్తి మాట్లాడుతూ సంఘర్షణలు పరిష్కరించడానికి గాంధీజీ ఆలోచనలు ఉపకరించే విధానాలు వివరించారు. ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతా మాణిక్యం తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎం.శ్యామ్ ప్రసాద్, విశాఖ స్టీల్ ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ పి.కిషోర్‌కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి వార్షిక పండగ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు అప్పలమ్మ అమ్మవారి వార్షిక పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో చినవాల్తేరు గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ, వైఎస్ఆర్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎంపీ ఎంవీవీ పాల్గొని కళాకారులను అభినందించారు. జబర్దస్త్ కళాకారుల ప్రదర్శన, నేల వేషాలు సందడిగా సాగాయి.

తీరంలో 26, 27 తేదీల్లో రిపబ్లిక్ డే ఉత్సవ్



ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జీవీఎల్ నరసింహారావు

బీచ్ రోడ్డు: రిపబ్లిక్ డే ఉత్సవ్ పేరుతో ఈ నెల 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు సాగరతీరంలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నామని ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రిపబ్లిక్ డే ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రిపబ్లిక్ డే ఉత్సవ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ భావాన్ని నగర వాసుల్లో నింపేందుకు 26వ తేదీ ఉదయం బీచ్‌రోడ్డులో ఫ్రీడం కలర్స్ వాక్ నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు దేశ భక్తితో కూడుకున్న ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ జరుగుతుందన్నారు. 26, 27 తేదీలలో సాయంత్రం సెలబ్రిటీలు, కళాకారులతో మ్యూజికల్ నైట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.